ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శనివారం 17 ఫిబ్రవరి 2024



వైసీపీ తలపెట్టిన సిద్ధం సభకు జన సమీకరణ ఆ పార్టీ నాయకులకు తలనొప్పిగా మారింది. ఏం చేసుకుంటారో.. ఏమోగానీ వేల మందిని తరలించాల్సిందేనని ముఖ్య నేతలు హుకుం జారీ చేస్తున్నారు. వేల మంది ఎలా వస్తారనీ, అంతమందిని తరలించలేమని కిందిస్థాయి నాయకులు చేతులెత్తేస్తున్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. అధికార వైసీపీని అసమ్మతి వెంటాడుతోంది. ప్రజల్లోనూ వ్యతిరేకత ఉందన్న భయం పట్టుకుంది. ఈ నేపథ్యంలో బలవంతపు బలప్రదర్శన ద్వారానైనా వ్యతిరేకత లేదని చెప్పుకునే ప్రయత్నం చేస్తోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆ దిశగా సిద్ధం పేరుతో సీఎం జగన్ బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈనెల 18న రాయలసీమ స్థాయిలో రాప్తాడులో సిద్ధం బహిరంగ సభ నిర్వహించనున్నారు. హిందూపురం నుంచి భారీఎత్తున తరలించాలని అధిష్టానం ఆదేశించడంతో స్థానిక నాయకులు ఆలోచనలో పడ్డారు. గత నెలలో హిందూపురంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రకు వందల్లో వచ్చారు. అలాంటిది రాప్తాడుకు 10వేల మంది జనాన్ని తరలించాలంటే ఏం చేసేదని మల్లగుల్లాలు పడుతున్నారు. ఇప్పటికే ఆయా మండలాల ముఖ్య నాయకులతో సమావేశమైన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త.. జనాన్ని తరలించే విషయంలో తగ్గకూడదంటూ హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. పట్టణంతోపాటు లేపాక్షి, చిలమత్తూరు మండలాలున్నాయి. నాలుగు ప్రాంతాల నుంచి 2,500 మంది చొప్పున తరలి వెళ్లాలనీ, అందుకు మండల నాయకులు సిద్ధం కావాలని ఆదేశాలిచ్చారు.

- హిందూపురం

సీఎం సభకు అంతమంది రారు..
తరలించడం వల్లకాదు..



- ఖర్చు ఎవరు భరిస్తారు..?
- చేతులెత్తేస్తున్న వైసీపీ నాయకులు
- సమావేశాల్లో బహిరంగంగానే వెల్లడిస్తున్న వైనం
- తరలించాల్సిందేనని ముఖ్య నేతల హుకుం
- ఐప్యాక్ ఆపసోపాలు





సిద్ధంగా లేరు..!!

తలలు పట్టుకుంటున్న నాయకులు

అధికార వైసీపీ గ్రాఫ్ రోజురోజుకీ పడిపోతోంది. దీనికితోడు రేపోమాపో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితుల్లో అసమ్మతి నాయకులు, అధికారులు కూడా ముఖ్య నేతలకు సహకరించేందుకు ఉత్సాహం చూపట్లేదు. దీంతో జనాన్ని ఎలా తరలించాలని తలలు బాదుకుంటున్నారు. సాక్షాత్తు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమావేశాలు నిర్వహిస్తేనే స్థానికంగా అదే గ్రామంలో రావడానికి కూడా జనం నిరాకరించిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో రాప్తాడుకు జనం రావాలంటే ఎలా అన్న సందేహం వైసీపీ వర్గాలను వేధిస్తోంది. ఇప్పటికే మంత్రి సమావేశమనీ, పింఛన్ల పంపిణీ అంటూ వారానికోసారి మహిళా సంఘాల వారిని ఇబ్బంది పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో సిద్ధం సభకు రావాలని పిలిచినా వచ్చే పరిస్థితిలో మహిళా సంఘాల సభ్యులు లేరు. దీనివల్ల స్థానికంగా చాలా ఇబ్బందులు పడుతున్నట్లు కొంతమంది మండలస్థాయి నాయకులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

రంగంలోకి ఐప్యాక్

నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన సర్వే బృందమైన ఐప్యాక్ అన్నీతానై వ్యవహరిస్తోంది. హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త.. మంత్రి పెద్దిరెడ్డి అనుచరురాలు కావడంతో ఐప్యాక్ బృందం తటస్థంగా వ్యవహరిస్తోందన్న వాదనలు ఆ పార్టీ శ్రేణుల నుంచే వినిపిస్తున్నాయి. అయినా సిద్ధం సభకు జనాన్ని తరలించే విషయంలోఆపసోపాలు పడుతున్నట్లు సమాచారం. కొంతమంది అసమ్మతి నాయకులకు ఐప్యాక్ బృందం సభ్యులు ఫోన్ చేసి, సభకు రావాలనీ, అక్కడికి వస్తే భవిష్యత్తు ఉంటుందనీ, తమ మాట వినివస్తే అధిష్టానానికి అనుకూలంగా రిపోర్టు పంపుతామని చెబుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. హిందూపురం నియోజకవర్గం నుంచి సిద్ధం

10 వేల మందిని తరలించాలని హుకుం

బహిరంగ సభకు 10వేల మందిని తరలించాలని ముఖ్యనేతలు.. నియోజకవర్గ బాధ్యులతోపాటు మండలాల నాయకులకు హుకుం జారీ చేసినట్లు సమాచారం. అంతమందిని తరలించడం సాధ్యంకాదని ఓ ముఖ్యనేత పేర్కొన్నారు. మండలానికి వెయ్యిమందిని పంపించవచ్చు కానీ 10వేల మంది అంటే ఎలా అని ముఖ్యనేతల వద్ద ప్రశ్నించినట్లు సమాచారం. ఇదే సందర్భంలో మరోనేత మాట్లాడుతూ.. మహిళాసంఘాల సభ్యులు ఉన్నారని వాటికి సంబంధించిన లీడర్లు, ఆ శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చయినా, బెదిరించైనా జనాన్ని తరలించాల్సిందేనని చెప్పినట్లు సమాచారం. సిద్ధం బహిరంగ సభకు 10వేల మందిని తర

ఖర్చుకు వెనకడుగు

లించాలంటే ఆషామాషీ కాదు. వారిని ఉదయం నుంచే బస్సుల్లో ఎక్కించాలి. ఓ వైపు రవాణాచార్జీలతోపాటు వచ్చే మహిళలకు భోజనాలు, పురుషులైతే వారికి కూలితోపాటు మద్యం ఇవ్వాల్సి ఉంటుందనీ, అంత ఖర్చు ఎలా భరించేదని ముఖ్యనేతలు ఆలోచనలో పడ్డారు. ఎన్నికల సందర్భంలో అంతమాత్రం ఖర్చు పెట్టుకోకపోతే ఎలా అని మరికొంతమంది నాయకులు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వచ్చుంటే ఖర్చు పెట్టినా బాగుండేది కానీ, ఎక్కడో నిర్వహించే సభకు అంత ఖర్చుపెట్టి జనాన్ని తరలించడం ఇబ్బందికరంగానే ఉంటుందని కొంతమంది నేతలు ఆలోచిస్తున్నారు.



కదిరిలో సిగపట్లు..

కదిరి: రాప్తాడులో నిర్వహించే సిద్ధం సభకు కదిరి నియోజకవర్గంలో జనసమీకరణకు వైసీపీ నాయకులు సిగపట్లు పడుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే సిద్దారెడ్డి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బూల్ బాషా మధ్య సమన్వయం కొరవడడంతో జన సమీకరణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలించాలని వైసీపీ పెద్దలు చెబుతుంటే.. ఎలా చేయాలో తెలియక సిగపట్లు పడుతున్నట్లు తెలుస్తోంది. అన్ని మండలాల్లో సమావేశాలు పెట్టినా కార్యకర్తల హాజరు అరకొరగానే ఉంది. కొన్ని మండలాల్లో ఎమ్మెల్యే వర్గం పూర్తిగా దురంగా ఉంది. మరి కొన్ని మండలాల్లో ఎమ్మెల్యే వర్గం హాజరైనా పూర్తిస్థాయిలో జన సమీకరణ చేస్తారా.. లేదా.. అన్నది అనుమానంగా ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గానికి 200పైగా బస్సులు అధిష్టానం కేటాయించినట్లు తెలిసింది. అన్ని బస్సులు నింపలేమని కార్యకర్తలు.. నాయకుల మొహమ్మీదే సభల్లో చెప్పినట్లు సమాచారం. ఎమ్మెల్యే సిద్దారెడ్డిని ఎలాగైనా కలుపుకునిపోవాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంతనాలు సాగిస్తున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఇంటికే మంత్రి వెళ్లి చర్చించారు. ఆయనకు ఎమ్మెల్యే నుంచి స్పష్టమైన హామీ రాలేదని సమాచారం. బస్సులు నింపడానికి వలంటీర్లు, మహిళాసంఘాల సభ్యులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఎలాగైనా బస్సులు నింపాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. సిద్ధం సభకు వైసీపీ అధిష్టానం దాదాపు రూ.కోటి నియోజకవర్గానికి ఖర్చు పెడుతున్నట్లు తెలిసింది. అయినా జనం వస్తారా.. రారా.. అన్న అనుమానం ఉందని వైసీపీ నాయకులే చెబుతున్నారు.

సిద్ధంకాని ఎమ్మెల్యే

సిద్ధం సభకు కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి సిద్ధంగా లేనట్లు సమాచారం. ఆయనను కాదని ఇన్‌చార్జిగా మక్బూల్ బాషాను నియమించిన రోజు నుంచే వారిద్దరి మధ్య సమన్వయం కొర వడింది. పార్టీ కార్యక్రమాలు ఇద్దరూ కలిసి చేసిన దాఖలాల్లేవు. ఎమ్మెల్యేని కాదని కదిరిలో ఆసరా సభ నిర్వహించడంతో వీరిద్దరి మధ్య దూరం మరింత పెరిగినట్లు తెలిసింది. మిగిలిన ఆసరా సభలకు రావాలని ఎమ్మెల్యేని వైకేపీ ఉద్యోగులు ఆహ్వానించినా, ఇన్‌చార్జిని పిలుచుకోవాలని సూచించినట్లు సమాచారం. ఇప్పుడు సిద్ధం సభను జయప్రదం చేసుకోవడానికి వైసీపీ అధిష్టానం నానా పాట్లు పడుతోంది. నియోజకవర్గంలో సిద్దారెడ్డి వర్గం సహాయ నిరాకరణ చేస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే కూడా సిద్ధం సభకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

మంత్రి మంతనాలు

ఎమ్మెల్యే సిద్దారెడ్డిని సిద్ధం సభకు సన్నద్ధం చేయడానికి మంత్రి పెద్దిరెడ్డి మంతనాలు సాగిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే ఇంటికి వచ్చి చర్చించారు. నాయకులందరూ ఉండగా ఎమ్మెల్యేతో మంత్రి మాట్లాడడంతోపాటు ఏకాంతంగా చర్చలు సాగించినట్లు తెలిసింది. అందులో కూడా మంత్రికి ఎమ్మెల్యే స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నది ఆయన వర్గీయుల ఉవాచ. మంత్రి మంతనాలు ఫలించలేదన్నది సమాచారం.

బస్సులు నింపలేమంటున్న కార్యకర్తలు

మండలానికి 30 బస్సులతోపాటు, కదిరి పట్టణానికి మరో 50కిపైగా కేటాయించినట్లు తెలుస్తోంది. మండలానికి పంపే 30 బస్సులే నింపలేమని కార్యకర్తలు.. మండల సమావేశాల్లో స్పష్టం చేసినట్లు తెలిసింది. మండలాల్లో నిర్వహించిన సమావేశాలకు కూడా కార్యకర్తలు అరకొరగానే హాజరైనట్లు తెలుస్తోంది. వచ్చిన వారు కూడా పూర్తిస్థాయిలో కార్యకర్తల సమీకరణ చేయలేమని చెప్పినట్లు సమాచారం. కొన్ని మండలాల్లో ఎమ్మెల్యే వర్గీయులు సమావేశాలకు హాజరుకాలేదు. నంబులపూలకుంట, నల్లచెరువు మండలాల్లో ఎంపీపీలు సమావేశాలకు దూరంగా ఉన్నారు. తనకల్లులో హాజరైనా ఎమ్మెల్యే, పూల శ్రీనివాసరెడ్డి వర్గీయుల మధ్య వాగ్వాదం తలెత్తినట్లు తెలిసింది. కొన్ని మండలాల్లో ఎమ్మెల్యే వర్గీయులు హాజరైనా జన సమీకరణకు కృషి చేస్తారో.. లేదోనన్న అనుమానం వ్యక్తమవుతోంది. పట్టణంలో ఇంతవరకు ఎటువంటి సమావేశం నిర్వహించలేదు. పలువురు కౌన్సిలర్లు కూడా దూరంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అధిష్టానం పంపిణీ బస్సులు నిండుతాయో.. లేదో కూడా అనుమానమేనని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు.


ఎమ్మెల్యే సిద్దారెడ్డితో మంతనాలు సాగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

మహిళాసంఘాలపై ఒత్తిడి

సిద్ధం సభకు జన సమీకరణలో భాగంగా మహిళాసంఘాల సభ్యులు, వలంటీర్లపై తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. సంఘాల్లోని ఆర్పీలు, గ్రూపు లీడర్లను మెప్మా సిబ్బంది ఆదేశించినట్లు తెలుస్తోంది. వలంటీర్లు కూడా జన సమీకరణ చేయాలని వారిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

ప్రయాణికులకు తిప్పలు తప్పవా..?

సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు
పురం డిపోలో ఉన్నది 83..
50 బస్సులు సీఎం సభకు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 16: రాప్తాడులో ఈనెల 18వ తేదీన నిర్వహించనున్న సీఎం సిద్ధం సభకు భారీగా జనాలను సమీకరించాలని వైసీపీ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రతి పంచాయతీ నుంచి ప్రజలను తరలించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పంచాయతీకి ఒకటి, పట్టణంలో అయితే వార్డుకొకటి, మండల కేంద్రానికి ఒక బస్సు చొప్పున ఏర్పాటు చేశారు. హిందూపురం నియోజకవర్గం నుంచి 125 బస్సులు తరలించాలని ఇప్పటికే ఆర్టీసీ వారికి అధికార పార్టీ పెద్దలు హుకుం జారీ చేశారు. హిందూపురం ఆర్టీసీ డిపోలో ఉన్నది 83 బస్సులు మాత్రమే. అందులో 50 బస్సులు పంపుతున్నట్లు సమాచారం. దీంతో ఆదివారం ప్రయాణికులకు తిప్పలు తప్పవు. జిల్లావ్యాప్తంగా 396 బస్సులుండగా.. 242 సిద్ధం సభకు కేటాయించినట్లు తెలుస్తోంది. సెలవు రోజు కావడంతో ఉద్యోగాలు, పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సొంత ఊర్లకు చేరుకుంటారు. బస్సులను శనివారమే స్వాధీనం చేసుకుని, వివిధ ప్రాంతాలకు పంపిస్తారు. దీంతో జిల్లాలో ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తప్పవు.

మందు, భోజనం ఇస్తాం..

ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య సిద్ధం సభ ప్రారంభమౌతుందని నాయకులు, కార్యకర్తలకు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రయాణం మొదలెట్టాలని సూచించారు. సిద్ధం సభకు వచ్చే వారికి భోజనం, మందు ఏర్పాటు చేస్తామని వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలకు ముఖ్య నేతలు తెలిపినట్లు సమాచారం. భోజనం, మందుతోపాటు ఒక్కొక్కరికి కనీసం రూ.500 ఇస్తేనే సభకు వస్తామని వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలకు ప్రజలు స్పష్టం చేసినట్లు సమాచారం.



60 రోజుల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

విద్యుత్ ఫోరం చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి16: విద్యుత్ సమస్యలపై పరిష్కార వేదిక ద్వారాగానీ, ఆన్‌లైన్‌లోగానీ ఫిర్యాదు చేస్తే 60 రోజుల్లో పరిష్కరిస్తామని విద్యుత్ అవగాహన ఫోరం చైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాసఆంజనేయమూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్ద గల సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారుల నుంచి ఫోరం చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి ఫిర్యాదులు స్వీకరించారు. 50 అర్జీలు అందించారు. చైర్మన్ మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 99శాతం సమస్యలను ఈ సదస్సు ద్వారా పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో ఈఈ జేవీ రమేష్, ఎస్ఏఓ బాలాజీ, ఏడీఈ నాగేంద్ర, ఏఏఓ రామకృష్ణ, ఏఈలు నాగభూషణ, కొండారెడ్డి, జానకీరామయ్య పాల్గొన్నారు.


ఫిర్యాదు స్వీకరిస్తున్న శ్రీనివాస ఆంజనేయమూర్తి

సూర్యప్రభపై శ్రీవారు

భక్తులకు దర్శనమిచ్చిన ఖాద్రీశుడు
జిల్లా వ్యాప్తంగా రథ సప్తమి

కదిరి, ఫిబ్రవరి 16: రథసప్తమిని పురస్కరించుకుని పట్టణంలో వెలసిన శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి శుక్రవారం సూర్యప్రభ వాహనంపై విహరించారు. ఉదయం 6 గంటలకు శ్రీవారికి నిత్య కైంకర్యాలు, పూజలను అర్చకులు పూర్తి చేశారు. స్వామి వారికి విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం శ్రీవారి ఉత్సవమూర్తిని అలంకరించి, సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చారు. రథోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. సూర్యప్రభపై శ్రీవారు తిరుమాడ వీధుల్లో వీధుల్లో విహరిస్తూ.. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు.. స్వామిని దర్శించుకుని, ఫల, పుష్పాలను సమర్పించారు. ఉత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గోవిందనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది.



హైకోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు

బీకే పార్థసారథి




పెనుకొండ, ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనకు అనుమతిస్తూ హైకోర్టు వెలువరించిన తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజధాని ఫైల్స్ సినిమా అంటేనే ముఖ్యమంత్రి జగన్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. దీంతో సినిమా ప్రదర్శించరాదంటూ కోర్టుకెళ్లాడన్నారు. రైతులపై తీసిన సినిమాను అడ్డుకునే దీనస్థితికి జగన్ ప్రభుత్వం దిగజారి పోయిందన్నారు. ఈ సినిమాలో అమరావతి రైతుల పట్ల ప్రభుత్వం చేసిన దారుణాలు వెలుగులోకి వస్తాయన్న భయం సీఎం జగన్‌కు పట్టుకుందన్నారు. 34వేల మంది రైతుల త్యాగాలకు వాస్తవిక రూపం ఈ సినిమా అన్నారు. మూడు ప్రాంతాల పేరుతో రాష్ట్రాన్ని విడగొట్టి, రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న జగన్‌కు ప్రజలు త్వరలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. రాజధానుల పేరుతో వైసీపీ నాటకాలు ఆడుతోందన్నారు. నిన్నటిదాకా మూడు రాజధానులంటూ నేడు హైదరాబాద్ రాజధాని అంటూ మాయమాటలు చెబుతున్నారన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని నిలబెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఆయన ఎద్దేవా చేశారు.

రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్‌రెడ్డిలో వణుకు: పల్లె



పుట్టపర్తి: రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్‌రెడ్డిలో వణుకు పుడుతోందని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి విమర్శించారు. సామాజిక బాధ్యతతో సినిమాతీస్తే దానిని అడ్డుకునేందుకు జగన్ కోర్టుకెళ్లాడన్నారు. 34వేల మంది రైతుల త్యాగాలను వివరిస్తూ తీసిన సినిమాను సీఎం సైకోలా అడ్డుకుంటున్నాడన్నారు. అమరావతి రైతుల ఉసురు జగన్‌ను తప్పదన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ ఓడిపోవడం ఖాయమన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్




అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేనేజర్

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

రొద్దం, ఫిబ్రవరి 16: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-4 బాలింతకు ముక్కిన బియ్యం అందజేయడంపై జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ అశ్వత్థనారాయణ పరిశీలించారు. 'బాలింతకు పంపిణీ చేసిన బియ్యం ఇవి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం ప్రచురించిన కథనం అధికారుల్లో చలనం తెచ్చింది. జిల్లాపౌరసరఫరాల శాఖ మేనేజర్ అశ్వత్థనారాయణ.. రొద్దంలోని 1, 2, 3, 4 అంగన్‌వాడీ కేంద్రాల్లో బియ్యం ప్యాకెట్లను పరిశీలించారు. ఆ ఒక్క ప్యాకెట్‌కు నీరు తగిలినందుకే బియ్యం ముక్కినట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బాలింత లక్ష్మికి నూతన ప్యాకెట్ అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ ఉన్నారు.

వైసీపీ ఫ్లెక్సీలు తొలగించేశారు..

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి16: పట్టణంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ ప్రహరీ ముందుభాగంలో వైసీపీ నాయకులు సిద్ధం ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై పోలీసు స్టేషనా.. వైసీపీ కార్యాలయమా?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం ప్రచురించిన కథనం అధికారుల్లో చలనం తెచ్చింది. స్పందించిన పోలీసు ఉన్నతాధికారులు సిద్ధఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. స్థానిక పోలీసులు వాటిని తొలగించేశారు. ప్రహరీ చుట్టూ ఫ్లెక్సీలు, జెండాలు కట్టేందుకు వీలులేకుండా ఇనుప కంచె ఏర్పాటు చేశారు.

మట్టి తవ్వకాలకు చెక్

అడ్డుకున్న ఇరిగేషన్ అధికారులు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని సీ కొడిగేపల్లి చెరువులో అనుమతులు లేకుండా మట్టి తవ్వి, తరలిస్తుండడంపై 'చెరువులో తోడేలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం ప్రచురించిన కథనం అధికారుల్లో చలనం తెచ్చింది. ఇరిగేషన్ డీఈ వెంకటరమణ, ఏఈ భార్గవ్.. సీ కొడిగేపల్లి వెళ్లి చెరువును పరిశీలించారు. మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను ఆపేశారు. డీఈ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా చెరువు మట్టిని తరలిస్తే చర్యలు తప్పవన్నారు.


మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపేసిన దృశ్యం

ఐటీ దాడులు

పురంలో ఫైనాన్షియర్ ఇల్లు, కార్యాలయంలో సోదాలు

హిందూపురం, ఫిబ్రవరి 16: పట్టణంలో శుక్రవారం ఆదాయపు పన్ను (ఐటీ) శాఖాధికారుల దాడులు కలకలం రేపాయి. హిందూపురం ప్రాంతంలో పేరుగాంచిన ఫైనాన్షియర్, స్థిరాస్తి వ్యాపారి అశ్విన్ ఇల్లు, కార్యాలయంపై ఐటీ అధికారులు ఏకకాలంలో మెరుపు దాడులు చేశారు. ఆదాయ పన్ను శాఖ కర్నూలు జాయింట్ కమిషనర్ హనష్కహక్, హిందూపురం అధికారి ప్రమిత్‌కుమార్, మరో పది మందికిపైగా సిబ్బంది రెండు బృందాలుగా విడిపోయి, ఉదయం 11 గంటలకు ఏకకాలంలో పట్టణంలోని నంజుండేశ్వర బిల్డింగ్ సమీపంలో ఉన్న అశ్విన్ ఇల్లు, చెక్కీటక్కూర్ వీధిలో ఉన్న అతడి కార్యాలయం శ్రీసద్గురు ఎంటర్ ప్రైజెస్‌పై దాడులు నిర్వహించారు. రాత్రి పది గంటలు దాటినా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. సాయంత్రం మూడు గంటల వరకు దాడుల విషయం బయటకు పొక్కలేదు. ఆ తరువాత బయటకు రావడంతో మీడియా అక్కడికి చేరుకుంది. ఆదాయపు పన్ను శాఖాధికారులను మీడియా సంప్రదించగా.. వివరాలు ఉన్నతాధికారులకు చేరవేస్తామన్నారు. రాత్రి 8 గంటల సమయంలో కర్నూలు జాయింట్ కమిషనర్ వెళ్లిపోగా.. మిగిలిన వారు సోదాలు కొనసాగించారు.


అశ్విన్‌కు మెడికల్ షాప్ యజమాని వైద్యం

స్పృహతప్పి..

శ్రీసద్గురు ఎంటర్‌ప్రైజెస్ కార్యలయంలో సోదాలు జరిగే సమయంలో ఫైనాన్షియర్ అశ్విన్ స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యుల వినతి మేరకు అతడికి వైద్యం చేయించారు. కానీ ఓ మందుల షాపు యజమాని వైద్యం చేయడం గమనార్హం. దానిని మీడియా ప్రతినిధులు ఫోటో తీయడానికి ప్రయత్నించగా.. మందుల షాపు యజమాని అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

పేరుగాంచిన ఫైనాన్షియర్

అశ్విన్ కొన్నేళ్లుగా ఫైనాన్స్‌తోపాటు చిట్‌లు, స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నాడు. హిందూపురంలో అతడి వద్ద రుణం తీసుకోని నాయకుడంటూ లేడంటే అతిశయోక్తి కాదు. ఇటీవల తమిళనాడులో రియల్ వ్యాపారంలో భారీగా పెట్టుబడి పెట్టినట్లు తెలిసింది. దీని ఆధారంగా ఆదాయపు పన్ను అధికారులు నిఘా పెట్టి, సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. అశ్విన్‌కు హిందూపురంలో విలువైన ప్రాంతంలో స్థలాలతోపాటు భవనాలు ఉన్నట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న బంగారు, పత్రాలకు సంబంధించి కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఫైనాన్స్‌లో ఒక్కడే ఉన్నాడా? భాగస్వాములు ఉన్నారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. ఆదాయపు పన్ను శాఖాధికారుల దాడుల నేపథ్యంలో కొందరు ఫైనాన్షియర్లు కార్యాలయాలను మూసేసి, పట్టణం వదిలి వెళ్లారు.

ఎన్నికల వేళ సమన్వయంతో పనిచేద్దాం

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేద్దాం
సమీక్షలో సరిహద్దు జిల్లాల అధికారులు

హిందూపురం, ఫిబ్రవరి 16: ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేద్దామని శ్రీసత్యసాయి, కర్ణాటక చిక్కబళాపురం జిల్లాల అధికారులు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం చిక్కబళాపురంలో సరిహద్దు జిల్లాల అధికారులు సమావేశమయ్యారు. చిక్కబళాపురం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రవీంద్ర, ఎస్పీ నగేష్, శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సెబ్ ఈఎస్ సుబ్రహ్మణ్యం, హిందూపురం డీఎస్పీ కంజాక్షన్‌తోపాటు రెండు జిల్లాలకు చెందిన ముఖ్య శాఖల అధికారులు హాజరయ్యారు. జిల్లాల అధికారులు మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేద్దామన్నారు. సమన్వయంతో ఎన్నికలు సజావుగా నిర్వహిద్దామన్నారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేద్దామన్నారు. ఎన్నికల్లో ఓటర్లకు పంచేందుకు నగదు, విలువైన ఆభరణాలు తదితర వస్తువుల రవాణాకు అడ్డుకట్ట వేసి, వాటిని సీజ్ చేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం చేసినా, ప్రలోభాలకు లొంగినా ఉద్యోగాలు ఊడతాయని హెచ్చరించారు.


సమీక్షలో పాల్గొన్న సరిహద్దు జిల్లాల అధికారులు

కార్మిక చట్టాలను కాలరాస్తున్న మోదీ: కార్మిక నేతలు


నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 16: ప్రధాని మోదీ.. కార్మిక చట్టాలను కాలరాస్తున్నారంటూ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మండిపడ్డారు. శుక్రవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు స్థానిక గణేష్ సర్కిల్‌లో నిరసనకు దిగారు. ఆంజనేయులు మాట్లాడుతూ.. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసిందన్నారు. తద్వారా కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్మికులు, రైతులకు నష్టం కలిగేలా చట్టాలను తీసుకొచ్చిందని మండిపడ్డారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కోట్ల రూపాయలు పంచిపెట్టారు తప్ప.. కార్మిక, కర్షకులకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, చలపతి, నాగార్జున, వెంకటరమణ, రామచంద్ర పాల్గొన్నారు.

ఊరు మారలేదు..!

- పునాదుల్లోనే పాలకులు చెబుతున్న అభివృద్ధి
- అసంపూర్తి నిర్మాణాలే ఆర్భాటానికి ఆనవాళ్లు
- ఏ గ్రామంలోనూ కానరాని సమగ్రాభివృద్ధి



రొళ్ల మండలం మల్లినమడుగులో పునాదులకే పరిమితమైన రైతుభరోసా కేంద్రం





కదిరికుంటపల్లిలో అర్ధంతరంగా ఆగిన రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనం

వైసీపీ నాయకులు ఆర్భాటంగా చెబుతున్న గ్రామాల అభివృద్ధి కేవలం పునాదుల్లోనే కనిపిస్తోంది. ఏ ఊరు చూసినా మొండిగోడలే దర్శనమిస్తున్నాయి. వీధులు మురుగునీటితో నిండుకున్నాయి. పల్లె దారులు గుంతలు, రాళ్లతో దర్శనమిస్తున్నాయి. ప్రతి పల్లెలోను రైతు భరోసా కేంద్రాలు కట్టాం. సచివాలయాలు నిర్మించాం. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశాం. అంగన్‌వాడీ భవనాలు, వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీలతో పల్లెకు అభివృద్ధిని పరిచయం చేశామని పాలకులు గొప్పలు పోతున్నారు కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. 'ఆంధ్రజ్యోతి' క్షేత్ర స్థాయి పరిశీలనలో వెలుగు చూసిన వాస్తవాలను ఒక సారి పరిశీలిస్తే.. ఊరు మారిందా..? లేదా అన్నది తేటతెల్లమవుతోంది.

అనంతపురం, (ఆంధ్రజ్యోతి)

అభివృద్ధికి ఆమడదూరంలో మల్లినమడుగు

మడకశిర నియోజకవర్గంలోని రొళ్ల మండలం మల్లినమడుగు అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన అభివృద్ధి పనులు మొండిగోడలకే పరిమితమయ్యాయి. నేటికీ ఆ గ్రామంలో మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. గుక్కెడు తాగునీటికి నోచుకోని దయనీయ స్థితిలో ఆ గ్రామ ప్రజలున్నారు. మల్లినమడుగు గ్రామంలో దాదాపు 800 కుటుంబా లున్నాయి. ఇప్పటి వరకూ ఆ గ్రామంలో ఒక రోడ్డు కూడా వేయలేదు. ఇళ్లులేని వారికి పట్టాలిచ్చారేగానీ ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. ఇందుకు రామాంజమ్మ దయనీయ స్థితే నిదర్శనం. ఆమెకు ఇంటిపట్టా ఇచ్చారు కానీ ఇల్లు మంజూరు చేయలేదు. దీంతో ఆమె నేటికీ పూరిగుడిసెలోనే తన కుటుంబంతో జీవనం సాగిస్తోంది. సచివాలయం, బల్కుకూలింగ్ సెంటర్, రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్‌క్లినిక్ తదితర భవనాల నిర్మాణాలను ప్రారంభించినప్పటికీ... ఇప్పటికీ పూర్తి కాలేదు. మొండిగోడల దశలోనే ఉన్నాయి. కొన్ని భవనాలు పునాదులకే పరిమితమయ్యాయి. నిధులలేమితో రెండేళ్లుగా ఆ భవన నిర్మాణాలు ఆగిపోయాయి. తెలుగుదేశం పాలనలో రూ.లక్షల ఖర్చులతో చేపట్టిన ఓహెచ్ఆర్ నిర్మాణం, శుద్ధజల నీటి పథకం పూర్తి చేయకపోవడంతో తాగునీటి కోసం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నరసాపురంలో ప్రధాన రహదారిలో మురుగు నిలిచిన దృశ్యం



ఆదర్శ గ్రామం నేడు మురికి కూపం

గుంతకల్లు మండలం ఎన్ నరసాపురం ఒకప్పుడు ఆదర్శ గ్రామం. ప్రస్తుతం వైసీపీ పాలనలో మురికి కూపంగా మారింది. గ్రామంలో వైసీపీ పాలనలో ఒక్క రోడ్డంటే ఒక్క రోడ్డు వేయలేదు. ప్రతి వీధి మురుగునీటితో దుర్గంధం వెదజల్లుతోంది. టీడీపీ మద్దతుదారుడిని సర్పంచ్‌గా అక్కడి ప్రజలు గెలిపించడంతోనే పాలకపార్టీ నేతలు ఆ గ్రామాన్ని అభివృద్ధిలో చిన్నచూపు చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నా యి.



నరసాపురంలో అపరిశుభ్రత

కదిరికుంట పల్లిలో కనిపించని ప్రగతి

కదిరి మండలంలోని కదిరికుంటపల్లిలో ప్రగతి కనిపించడం లేదు. గ్రామ సచివాలయం నిర్మాణంతోనే సరిపెట్టారు. సిమెంట్ రోడ్డు మాత్రమే వేశారు. రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల ఆలనా పాలన పట్టించుకోకపోవడంతో భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. నాడు-నేడు పథకం అమలు తీరుకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అద్దం పడుతోంది.



కదిరికుంటపల్లిలో కూలడానికి సిద్ధంగా ఉన్న ప్రాథమిక పాఠశాల

మల్కాపురంలో ఆర్బీకేకి మోక్షం లేదు



ధర్మవరం మండలంలోని మల్కాపురం గ్రామంలో దాదాపు రూ.10లక్షల వ్యయంతో మూడేళ్ల క్రితం రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేపట్టారు. పిల్లర్లు వేసి వదిలేశారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో ఆర్బీకే నిర్మాణం ఆగిపోయింది. అదొక్కటే కాదు... ఆ గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం ముందుకు సాగడం లేదు.

చిన్నజలాలపురంలో గుంతల రోడ్లే..!

శింగనమల మండలం చిన్నజలాలపురం సమస్యలకు కేంద్రంగా మారింది. వైసీపీ పాలనలో ఆ గ్రామంలో ఒక్కటంటే ఒక్కటి కూడా రోడ్డు వేయలేదు. అపరిశుభ్రతకు ఆగ్రామం నిలయంగా ఉంది. గ్రామంలోని దారులన్నీ గుంతలమయే. ఏ కాలనీలో చూసినా డ్రైనేజీ అస్తవ్యస్తమే. నాడు-నేడుతో పాఠశాలను పునరుద్ధరిస్తామని గొప్పలు పోవడం తప్పా ఇప్పటి వరకు అమలు చేయలేదు. అంగన్‌వాడీ భవనాన్ని నిర్మిస్తామని చెప్పినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.



చిన్న జలాలపురం గ్రామంలో రోడ్ల దుస్థితి ఇదీ..

ముచ్చుకోటలో వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీ ఏదీ..?

తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దపప్పూరు మం డలం ముచ్చుకోట గ్రామంలో వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీ కనిపించడం లేదు. ఆ గ్రామ జనాభా 2730 మంది. ఈ ఐదేళ్లల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ఏ ఒక్కటీ పూర్తి కాలేదు. అండర్‌డ్రైనేజీ కింద రూ.30లక్షలతో చేపట్టిన పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. వీధులు డ్రైనే జీ నీటితో మురుగు కాలువలను తలపిస్తున్నా యి. జల్‌జీవన్ కింద పైపులైన్ల కోసం రోడ్లను అడ్డదిడ్డంగా తవ్వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నేటికీ సిమెంట్ రోడ్ల కోసం వీధులు ఎదురుచూస్తున్నాయి. గ్రామంలో రూ.30లక్షలతో సచివాలయం, రూ.22లక్షలతో ఆర్బీకే, రూ.17లక్షలతో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల భవనాలు పూర్తి చేసినా ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. అంగన్‌వాడీ భవనాలు నిర్మించారు కానీ నేటికీ అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు




స్వామివారి ఉత్సవమూర్తులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి16: దేవదేవుడు కొండమీదరాయుడు స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్థానిక కొండమీదరాయుడు స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. సాయంత్రం ఆలయంలో స్వామి వారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పల్లకీలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను స్వామి పుట్టు శిల అయిన దేవరకొండపైకి తీసుకెళ్తారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం 11 రోజుల పాటు స్వామివారు ఒక్కో రోజు ఒక్కో వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

డీజిల్ ట్యాంకర్ పట్టివేత

పుట్లూరు/తాడిపత్రి, ఫిబ్రవరి 16: మండల పరిధిలోని ఎ.కొండాపురం గ్రామ శివారులో కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్ రవాణా చేస్తున్న ట్యాంకర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా పెట్రోల్‌బంక్ నిర్వహిస్తున్న మహేశ్వర్‌రెడ్డి ఈ డీజిల్‌ను మడ్డిపల్లికి తరలిస్తుండగా శుక్రవారం పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. ట్యాంకర్‌లో సుమారు నాలుగు వేల లీటర్ల డీజిల్ ఉన్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు వైరల్ అయ్యాయి. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి డీజిల్ మాఫియాను నడుపుతున్నారని, పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్న మహేశ్వర్ రెడ్డి ఆయన అనుచరుడని పోస్టులు పెట్టారు. తాడిపత్రి మున్సిపాలిటీలో చెత్త తరలించే వాహనాలకు, స్టీల్‌ప్లాంట్ వాహనాలకు కర్ణాటక డీజల్‌ను తెచ్చారని ఆరోపించారు. జిల్లా ధరలతో పోలిస్తే కర్ణాటకలో లీటర్ డీజిల్‌పై రూ.12 మిగులుతుందని, అందుకే రెండేళ్ల నుంచి ఎమ్మెల్యే పెద్దారెడ్డి డీజిల్ దందా నడుపుతున్నారని పోస్టులు పెట్టారు.



పట్టుబడ్డ ట్యాంకర్

కర్ణాటక మద్యంతో పట్టుబడ్డ కానిస్టేబుల్?

హిందూపురం, ఫిబ్రవరి 16: చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు కర్ణాటక మద్యం తరలిస్తున్న ఒక కానిస్టేబుల్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులు శుక్రవారం పట్టుపడ్డారు. ఈ ముగ్గురు గోవా ట్రిప్‌కి వెళ్లి తిరిగి వస్తూ కొడికొండ చెక్‌పోస్టుకి చేరుకున్నారు. అక్కడ సెబ్ అధికారులు కారును తనిఖీ చేయగా.. అందులో కర్ణాటక మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. వెంటనే మద్యంతోపాటు కారు, ఆ ముగ్గురు వ్యక్తులను స్టేషన్‌కు తరలించి, విచారణ చేపట్టారు. పట్టుబడిన ముగ్గురిలో ఒకరు కడప జిల్లా సిద్ధవటం పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ అనీ, మరో ఇద్దరు లక్ష్మీనారాయణ, నాగేంద్ర గుత్తికి చెందిన వారని తెలిసింది. వీరిలో ఒకరు రైల్వే ఉద్యోగి అని సమాచారం. స్టేషన్‌లో విచారిస్తున్న సమయంలో పట్టుబడిన కానిస్టేబుల్ తప్పించుకుని పారిపోయినట్లు సమాచారం. దీనిపై చిలమత్తూరు ఎస్ఐ గంగాధర్‌ను వివరణ కోరగా... గుత్తి ప్రాంతానికి చెందిన ఇద్దరు గోవాకి వెళ్లి విమానం ద్వారా బెంగళూరు ఎయిర్ పోర్టుకి వచ్చారని, అక్కడి నుంచి మద్యం బాటిళ్లు తీసుకొచ్చారని తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి కారులో గుత్తికి వెళుతుండగా దేవనహళ్లి సమీపంలో సిద్ధవటానికి చెందిన కానిస్టేబుల్ లిఫ్ట్ అడిగి ఎక్కి వచ్చారని తెలిపారు. విడివిడిగా ముగ్గురినీ విచారించామని, విమాన టికెట్లు కూడా పరిశీలించామని తెలిపారు. కానిస్టేబుల్ ప్రమేయం లేదని నిర్ధారించుకున్నాక పంపించామని ఎస్ఐ తెలిపారు.

రేపు వాహనాల దారి మళ్లింపు

రాప్తాడు, ఫిబ్రవరి 16: సీఎం జగన్ ఈనెల 18న రాప్తాడులో నిర్వహించే సిద్ధం సభకు హాజరవుతున్న కారణంగా 44వ జాతీయరహదారి మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. బెంగళూరు నుంచి అనంతపురం మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు (అత్యవసర వాహనాలు మినహా) కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వద్ద డైవర్షన్ చేసుకుని కనగానపల్లి, నూతిమడుగు, కళ్యాణదుర్గం మీదుగా అనంతపురం వచ్చి 44వ జాతీయ రహదారి గుండా వెళ్లాలన్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లే వాహనాలు అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి వద్ద దారి మళ్లించారు. సోములదొడ్డి, తడకలేరు, గుత్తిరోడ్డు, ఎన్టీఆర్ మార్గ్‌రోడ్డు, బుక్కరాయసముద్రం, నార్పల, బత్తలపల్లి, ధర్మవరం మీదుగా మామిళ్లపల్లికి చేరుకుని 44వ జాతయ రహదారి గుండా వెళ్లాలన్నారు. చెన్నై, కదిరి వైపు నుంచి పంగల్‌రోడ్డు మీదుగా రాప్తాడులో జాతీయ రహదారిపై హైదరాబాద్ వెళ్లాల్సిన వాహనాలు బత్తలపల్లి వద్ద దారి మళ్లించామన్నారు. బత్తపల్లి నుంచి నార్పల, బుక్కరాయసముద్రం, ఎన్టీఆర్ మార్గ్, గుత్తిరోడ్డు, తడకలేరు, సోములదొడ్డి వద్ద జాతీయరహదారి గుండా వెళ్లాలన్నారు. హైదరాబాద్ నుంచి అనంతపురం మీదుగా కదిరి, చెన్నై వైపు వెళ్లాల్సిన వాహనాలు కూడా సోములదొడ్డి, బుక్కరాయసముద్రం, నార్పల, బత్తలపల్లి మీదుగా వెళ్లాలన్నారు. వాహనాల మళ్లింపు ప్రదేశంలో ట్రాఫిక్ డైవర్షన్ వివరాలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. నగర ప్రజలు కూడా సీఎం పర్యటన సందర్భంగా ఆదివారం పంగల్‌రోడ్డు, కలెక్టరేట్, మునలమ్మకట్ట, ఎన్టీఆర్ మార్గ్ రోడ్డులో వాహనాల రాకపోకలతో రద్దీ ఉండే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ రహదారుల గుండా గమ్యం చేరుకోవాలన్నారు. సీఎం సభకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు 16 ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో టీడీపీదే విజయం

- అన్నిస్థానాల్లో విజయఢంకా
- 22న జిల్లాస్థాయిలో భారీ బహిరంగ సభ
- టీడీపీ నేతలు

రామగిరి, ఫిబ్రవరి 16: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో శ్రీసత్యసాయి జిల్లాలో టీడీపీ విజయఢంకా మోగించ నుందని ఆ పార్టీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీకేపార్థసారథి, మాజీ మంత్రులు పరిటాలసునీత, పల్లెరఘునాథరెడ్డిలు పేర్కొన్నారు. రామగిరి మండలం వెంకటాపురంలో శుక్రవారం జిల్లాలో ఆరు అసెంబ్లీ వర్గాలటీడీపీ ఇన్‌చార్జ్‌లు, ముఖ్యనాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గాల్లో చేపట్టబోయే అంశాల గు రించి చర్చించారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చే వారికి సముచిత స్థానం కల్పించడం వంటి వాటిపై చర్చించారు. ముఖ్యంగా గత ఐదేళ్లగా ఎన్నో ఇబ్బందులు పడ్డనాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఈనెల 19న నియోజకవర్గస్థాయి సమన్వయ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈనెల 22న జిల్లా స్థాయి బహిరంగసభను నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ..రానున్న ఎన్నికలలో జిల్లాలో వైసీపీ కనుమరుగు కావడం ఖాయమన్నారు. చాలా నియోజకవర్గాల్లో కనీసం ఆ పార్టీకి డిపాజిట్ కూడా వచ్చే అవకాశం కూడా లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. వైసీపీలో విసిగిపోయిన ఆ పార్టీ నాయకులు టీడీపీలోకి పెద్ద ఎత్తున చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనాటికి టీడీపీలోకి భారీగా చేరికలు ఉంటాయని, సమష్టిగా పనిచేసి అన్ని అసెంబ్లీ స్థానాల్లో పార్టీజెండా ఎగురవేస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండముల తిప్పేస్వామి, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు.



సమావేశంలో పరిటాల సునీత, బీకే, పల్లె, కందికుంట, తిప్పేస్వామి, పరిటాల శ్రీరామ్

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి16: గుత్తి మండలం గొల్లలదొడ్డి గిరిజన గురుకుల పాఠశాలలో 5,6,7,9 తరగతుల ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా అధికారి రామాంజనేయులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో 80, 6వ తరగతిలో 47, 7వ తరగతి 20, 9వ తరగతిలో 11 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 5వ తరగతి మినహా... మిగిలిన తరగతులకు ఎస్టీ విద్యార్థులను మాత్రమే ఎంపిక చేస్తామన్నారు. 5వ తరగతిలో ఎస్టీ 75, ఎస్సీ 12 శాతం, బీసీ 5 శాతం, ఓసీ 2 శాతం, ఏఈఓ 3 శాతం చొప్పున ఖాళీలన భర్తీ చేస్తామన్నారు. విద్యార్థులు www.aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 10వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 21వ తేదీన ఉమ్మడి జిల్లాకు సంబంధించి విద్యార్థులకు గొల్లలదొడ్డి పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు గొల్లలదొడ్డి పాఠశాల ప్రిన్సిపాల్ 9542655088, 95506 55840, 8341603090 నంబర్లలో సంప్రదించాలన్నారు.

షర్మిలతోనే వైఎస్సార్ ఆశయ సాధన

- కిరణ్ కుమార్‌రెడ్డితోనే కాంగ్రెస్‌కు ఈ దుస్థితి
- పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్



సమావేశంలో ప్రసంగిస్తున్న మాణిక్యం ఠాకూర్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 16: షర్మిలతోనే వైఎస్సార్ ఆశయ సాధన సాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్ అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి తప్పిదాలతోనే కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఈ దుస్థితి ఏర్పడిందని అన్నారు. అనంతపురంలో పార్టీ రాయలసీమ జిల్లాల విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ వారసురాలు షర్మిల రెడ్డి కాంగ్రెస్‌లోకి వచ్చారని, వైఎస్సార్ ఆశయ సాధన దిశగా అడుగులు ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ ఎన్నికల్లో కేంద్రంలో అధికారం సాధించడమే లక్ష్యంగా పోరాటం చేస్తున్నామని అన్నారు. పోలింగ్ కేంద్రం స్థాయి నుంచి పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర విభజనకు వైఎస్సార్ వ్యతిరేకమని, ఆ తరువాత ముఖ్యమంత్రి అయిన కిరణ్‌కుమార్ రెడ్డి రాష్ట్ర విభజన జరుగుతుందని తెలిసినా స్వార్థ ప్రయోజనాలకోసం ఏమీ చేయలేకపోయారని విమర్శించారు. విభజన అనివార్యం అయినప్పుడు చట్టబద్ధంగా హక్కులను కూడా ఆయన సాధించలేకపోయారని అన్నారు. పదేళ్లుగా కాంగ్రెస్ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పార్టీ అధిష్ఠానం దృష్టిలో ఉన్నాయని, అందరికీ అండగా ఉంటామని అన్నారు. ఏపీలో కేవలం పదేళ్లుగా కాంగ్రెస్ అధికారంలో లేదని, త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలకొల్పే అవకాశాలు ఉన్నాయని అన్నారు. పీసీసీ అధ్యక్షులిగా షర్మిల రాష్ట్ర హక్కులకోసం పోరాటం చేస్తున్నారని అన్నారు. సోనియా, రాహుల్‌గాంధీ మద్దతు ఆమెకు సంపూర్ణంగా ఉందని అన్నారు. రాహుల్ ప్రధాని అయిన వెంటనే ఏపీకి ప్రత్యేక హోదాపై మొదటి సంతకం చేస్తారని అన్నారు. జగన్ డబ్బు పిచ్చి కారణంగా రాష్ట్రం ఇబ్బందులను ఎదుర్కొంటోందని అన్నారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్, రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

అనంత నుంచే ప్రచారం: రఘువీరా

కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం అనంతపురం జిల్లా నుంచే మొదలౌతుందని రఘువీరారెడ్డి అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈనెల 26న జిల్లా పర్యటనకు వస్తున్నారని తెలిపారు. పదేళ్లుగా రాష్ట్రం భ్రష్టు పట్టిందని, గాడిలో పెట్టాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందని అన్నారు. పల్లంరాజు, తులసిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల మేనిఫెస్టో సిద్ధమౌతోందని అన్నారు.


- వచ్చే ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయడానికే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తులసిరెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికలలో మెజార్టీ స్థానాలను దక్కించుకుని, కేంద్రంలో అధికారం చేపట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు.
- రాష్ట్ర విభజన అనంతరం వచ్చిన ప్రాంతీయ పార్టీల ద్వారా రాష్ట్రం భ్రష్టు పట్టిందని పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్ అన్నారు. ప్రధానంగా రాయలసీమకు దిక్కే లేకుండా పోయిందని అన్నారు. రాయలసీమ గురించి పట్టించుకునే నాయకుడే కరువయ్యారని అన్నారు. రాయలసీమ హక్కుల సాధనకు పోరాటం చేస్తామని ఆయన అన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం, సిటీ, ఫిబ్రవరి 16: రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న వాచ్‌మెన్-8, ఆఫీస్ సబార్డినేట్- 8, శానిటరీ వర్కర్స్-8 ఉద్యోగాలను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ఆ శాఖ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 22 నుంచి 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా కేంద్రంలోని ఆశాఖ ప్రధాన కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని వారు సూచించారు.

రఘువీరా ఓ పొలిటికల్ బ్రోకర్

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



అనంతపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి ఓ పొలిటికల్ బ్రోకర్ అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సిద్ధం బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు శుక్రవారం ఆయన అనంతపురం వచ్చారు. 'పగటిపూట ఖూనీలు చేసేవాళ్లు కూడా మా పార్టీ గురించి మాట్లాడితే ఎలా..?' అని రఘువీరా చేసిన వ్యాఖ్యలపై పెద్దిరెడ్డి స్పందించారు. రాజశేఖర్‌రెడ్డి బతికున్న రోజుల్లో రఘువీరారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి ఆయన అడుగులకు మడుగులొత్తారని అన్నారు. రాజశేఖర్‌రెడ్డి చనిపోయిన తరువాత వైఎస్ కుటుంబానికి వ్యతిరేకంగా పనిచేసినవాళ్లలో ప్రధాన ముద్దాయి రఘువీరారెడ్డే అని అన్నారు. అలాంటి వ్యక్తికి తన గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. 'నేను తప్పులు చేసి ఉంటే నిరూపించమనండి... రాజకీయాల నుంచి తప్పుకుంటా' అని రఘువీరాకు సవాలు విసిరారు. కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచిందే రఘువీరారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి అని అన్నారు. రాజశేఖర్‌రెడ్డి పేరు చెప్పుకొని వేల కోట్లు దోచుకున్న వ్యక్తుల్లో రఘువీరారెడ్డి ఒకరని అన్నారు. 'పుట్టపర్తి సత్యసాయిబాబా చనిపోతే.. రేపు.. ఎల్లుండి అంటూ పార్థివదేహాన్ని తీసుకురాకుండా రోజులు తరబడి గడిపారు. బాబా డబ్బంతా లారీల్లో తరలించింది రఘువీరారెడ్డి కాదా?' అని ప్రశ్నించారు. ఈ విషయం తనకంటే జిల్లావాసులకే ఎక్కువగా తెలుసని అన్నారు. రఘువీరారెడ్డి ఒక పొలిటికల్ బ్రోకర్ అని, అతని గురించి తాను మాట్లాడటం ఎందుకని అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాడేపాటే రఘువీరా పాడుతున్నారని, నోటికొచ్చింది మాట్లాడుతారని, అతనికి పిచ్చి అని అన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి16: మండల పరిధిలోని చెదళ్ల గ్రామంలో వేమయ్యగారి లక్ష్మమ్మ(110) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. పాత చెదళ్ల గ్రామానికి చెందిన వేమయ్య గారి చెన్నారెడ్డి భార్య వేమయ్యగారి చెన్నమ్మ 1914లో జన్మించింది. చెన్నమ్మ స్వస్థలం గార్లదిన్నె మండలం యర్రగుంట్ల అయితే 1930లో చెన్నారెడ్డిని వివాహం చేసుకున్నట్లు కుమారుడు అశ్వర్థరెడ్డి తెలిపారు. మృతి చెందిన వృద్ధురాలికు సంతానం పెద్దకుమార్తె చెన్నమ్మ 85 మృతి చెందగా, రెండో సంతానం కుమారుడు పెద్దకొడుకు అశ్వర్థరెడ్డి 80 , వెంకటరెడ్డి 65, జయరామిరెడ్డి 60, చెన్నారెడ్డి50ఉన్నారు. వీరాంతా చెదళ్ల గ్రామంలో నివాసంటున్నారు. దేశం లో మొదటి ఎన్నికలు జరిగిన నాటి నుంచి తన ఓటు హక్కును వినియోగించుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నిత్యం ఆరోగ్యంగా ఉంటూ తన పని తానే చేసుకునేదన్నారు. గురువారం రాత్రి స్వల్పంగా అ స్వస్థతకు గురై అర్ధరాత్రి కన్ను మూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వైసీపీని ఇంటికి సాగనంపుదాం


ధర్మవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు


తాడిమర్రి మండలం దాడితోటలో..


ముదిగుబ్బ మండలం బీడిమర్రిలో..

● భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకుల పిలుపు

ధర్మవరం, ఫిబ్రవరి 16: రాష్ట్రంలో వైసీపీని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపుదామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 6వ వార్డులో శుక్రవారం వారు టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ.. అందులోని పథకాల గురించి వివరించారు. అదేవిధంగా వార్డులలో ఏఏ సమస్యలు ఉన్నాయో అడిగితెలుసుకుంటున్నారు. అనంతరం మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమన్నారు. సీఎం జగన్ ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు. అరాచకాలు, దౌర్జన్యాలు రాజ్యమేలాయన్నారు. ఈ నియంత ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపుదామని పిలుపునిచ్చారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. టీడీపీ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, జిలకర శీన, రాళ్లపల్లి షరీఫ్, గోసల శ్రీరాములు, పల్లపు శివశంకర్, కరెంటు ఆది, మాధవరెడ్డి, గంగారపురవి, పుట్లూరు సంజీవులు, నాగేంద్ర, చెలిమిశివరాం ఉస్మాన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోతులనాగేపల్లి, కనంపల్లి గ్రామాల్లో భవిష్యత్తుకు భరోసా

ధర్మవరంరూరల్: మండలంలోని పోతులనాగేపల్లి, కనంపల్లి గ్రామాల్లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ప్రజల సమస్యల్ని తెలుసుకుని వాటి ఫిర్యాదులను పరిటాల శ్రీరామ్ ఏర్పాటు చేయించిన ఫిర్యాదుల బాక్సులోకి వేయించారు. టీడీపీ అధికారంలోకి రాగానే పరిటాల శ్రీరామ్ ఆ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న, నాయకులు గొట్లూరుశ్రీనివాసులు, విజయసారథి, విజయ్‌చౌదరి, భాస్కర్‌చౌదరి, తలారివెంకటలక్ష్మీ, ముచ్చురామక్రిష్ణ, ఆదెప్ప, నరేష్, శ్రీనివాసులు, రమణ, పోతుకుంటరవి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడితోటలో..

తాడిమర్రి: మండలంలోని దాడితోట గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ కూచిరామ్మోహన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ.. మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. కుటుంబంలో ఎవరెవరికి ఏయే పథకాలు వర్తిస్తాయి.. ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. చంద్రబాబు సీఎం అయితే అందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు.

బీడిమర్రి, గాండ్లవారిపల్లిలలో..

ముదిగుబ్బ: మండలంలోని బీడిమర్రి, బీడిమర్రికొట్టాల, గాండ్లవారిపల్లి గ్రామాలలో తెలుగుదేశం శ్రేణులు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మినీమేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. జగన్ పాలనలో జరిగిన అవినీతిని, అరాచకాలను తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, కరణంప్రభాకర్, అశ్వర్థరెడ్డి, కనుమచంద్ర, కోట్లబాబీ, మహబూబ్‌పీరా, గోపాల్‌రెడ్డి, ఆనంద్, వినోద్, బాలకృష్ణ, సూరి, మురళి, బాలరాజు, తిరుపాల్, తుమ్మలసూరి, బొట్టుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తా

● నియోజకవర్గంలో సమస్య ఉన్న గ్రామాలను గుర్తించండి

● అనుచరులకు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూచన


అనుచరులతో మాట్లాడుతున్న గోనుగుంట్ల

ధర్మవరం, ఫిబ్రవరి 16: ధర్మవరం నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో తన సొంత ఖర్చులతో సమస్య తీర్చడానికి సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యేగోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన ధర్మవరం నియోజకవర్గంలోని తన అనుచరులతో సమావేశమై మాట్లాడారు. వేసవి కాలం సమీపిస్తుండడంతో నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలిపినా ఎవరూ పరిష్కరించే పరిస్థితి కనిపించలేదన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడం కోసం సొంత నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే నియోజకవర్గంలో ఏఏ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందో గుర్తించి ప్రణాళిక తయారు చేయాలని అనుచర వర్గాన్ని ఆదేశించారు. గ్రామాలకు వెళ్లి ప్రజలను కలిసి ఎటువంటి చర్యలు తీసుకుంటే తాగునీటిసమస్య తీరుతుందో అడిగి తెలుసుకోవాలని సూచించారు. అయాగ్రామస్థుల అభిప్రాయం మేరకు నీటి సమస్యను తీర్చడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలోనే గ్రామాలకు వెళ్లి తాగునీటి సమస్యకు సంబంధించిన వివరాలను తనకు సమర్పించాలని ఆయన అనుచరులను కోరారు.

భద్రతా ఏర్పాట్లలో లోటు రాకూడదు: కలెక్టర్


ఎయిర్‌పోర్టును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 16 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటు రాకుండా చూడాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని ఎయిర్‌పోర్టులో శుక్రవారం ఆయన ఎస్పీ మాధవరెడ్డి, ముఖ్యమంత్రి భద్రతా సిబ్బందితో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదివారం జిల్లా పర్యటనకు రానున్నారని తెలిపారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 2:45కు పుట్టపర్తికి చేరుకుంటారని, అక్కడి నుంచి 2:55కు ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో రాప్తాడుకు వెళ్తారని, అక్కడ సభ అనంతరం తిరిగి హెలీక్యాప్టర్‌లో పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు చేరుకుని సాయంత్రం 5:45కు ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్లనున్నారని వివరించారు. ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని సిబ్బందికి సూచించారు. ఎయిర్‌పోర్టులో ప్రత్యేక భద్రత నిర్వహించనున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఈఎస్ సహదేవ, ఆర్‌అండ్‌బీ అధికారి సంజీవ, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీఎస్పీ వాసుదేవ, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు స్పందన కరువు

● రోగులకంటే వైద్య సిబ్బందే అధికం


జనం లేక వెలవెలబోతున్న జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరం

కొత్తచెరువు,ఫిబ్రవరి 16: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. వీటికి ప్రజల నుంచి స్పందన కరువైంది. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని వైద్యాధికారులు, సిబ్బంది నిర్వహించారు. అయితే ఇందులో పారాసిటమల్‌తో పాటు ఒకటి అర జబ్బులకు సంబంధించిన మం దులను మాత్రమే అందిస్తున్నారు. ఇతర జబ్బులకు సంబంధించిన మందులు అందించకపోవడంతో జనం రావడం లేదు. ఈ శిబిరంలో రోగుల కంటే వైద్యసిబ్బందే అధికంగా కనిపించారు. రోగులు లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ప్రభుత్వం 70 రకాల జబ్బులకు మందులను అందిస్తున్నామని గొప్పలు చెబుతోంది. వాస్తవానికి రెండు లేదా మూడు రకాల మందులకు మాత్రమే మందులు అందుబాటులో ఉంచారు. మందులు లేని వైద్యశిబిరాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సిబ్బందిని ప్రజలు ప్రశ్నించినట్టు సమాచారం.

గ్రామాల్లో నీటి సమస్యపై దృష్టి పెట్టండి

బత్తలపల్లి, ఫిబ్రవరి 16: గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ త్రివేణి అధికారులకు సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవి కాలం ప్రారంభమైందని, నీటి ఎద్దడి తలెత్తే గ్రామాలపై దృష్టి పెట్టి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు తెలిపారు. నిర్లక్ష్య వహిస్తే చర్యలు తప్పవన్నారు. దంపెట్ల సర్పంచ్ కరుణాకర్ మాట్లాడుతూ.. మండలంలో చాలా గ్రామాకు 104 వైద్య సేవలు అందడం లేదని, పలు మార్లు అడిగినా వైద్యాధికారులు స్పందించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ ప్రసాద్, పశువైద్యాధికారి గురునాథ్‌రెడ్డి, ఏఓ ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్యానికి ప్రాధాన్యత

పుట్టపర్తి, ఫిబ్రవరి 16 : మునిసిపాలిటీలో తాగునీటికి, పారిశుధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తికి ప్రాధాన్యత ఉందన్నారు. ఆ ప్రాధాన్యతను గుర్తుంచుకుని పారిశుద్యానికి ప్ర త్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలి

ధర్మవరం, ఫిబ్రవరి 16: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లపట్టాలకు రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయప్లానింగ్ సెక్రటరీలు, అడ్మిన్‌కార్యదర్శులు, రెవెన్యూ కార్యదర్శులతో ఆయన అత్యవసర సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో మొత్తం 13,421 మందికి ఇళ్లపట్టాలను ఇవ్వడంజరిగిందన్నారు. ఇందులో మొదటి దశలో 8,475 మందిలో 4871 మంది ఇంటి పట్టాలకు రిజిస్ట్రేషన్ పూర్తి కావడం జరిగిందన్నారు. మిగిలిన పట్టాలకు ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అనారోగ్యంతో సచివాలయ ఉద్యోగి మృతి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి16: గ్రామసచివాలయ ఉద్యోగి సురేంద్రాచారి(38) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కదిరి పట్టణానికి చెందిన సురేంద్రాచారి మండలంలోని కాళసముద్రం సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారని, అయితే గత కొన్నాళ్లుగా షుగర్‌వ్యాధితో బాధపడుతున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మధ్యకాలంలో అనారోగ్యం తీవ్రమైందన్నారు. షుగర్‌లెవల్స్ పడిపోవడంతో ఇటీవల స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించామన్నారు. అయితే డిశ్చార్జి అయి ఇంటికి రాగానే మృతి చెందినట్లు తెలిపారు. తోటి సిబ్బంది ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ధర్మవరం వన్‌టౌన్ ఎస్‌ఐగా శ్రీనివాస్

ధర్మవరం, ఫిబ్రవరి 16: ధర్మవరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా డీ .శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం వీఆర్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మహమ్మద్‌రఫీ తిరుపతికి బదిలీ అయ్యారు.

ఘనంగా రథసప్తమి


వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ధర్మవరం, ఫిబ్రవరి 16: పట్టణంలోని పలు ఆలయాల్లో రథసప్తమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంతో పాటు శ్రీనివాసనగర్, కొత్తపేట ప్రాంతాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తొలుత అర్చకులు ఆలయాల్లో మూలవిరాట్‌లకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం అర్చనలు, విశేష పూజలు, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు జరిపారు. తర్వాత స్వాముల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి పూలపల్లకిలో కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. మంగళవాయిద్యాలు, భజనల నడుమ ఊరేగింపు భక్తిశ్రద్ధలతో సాగింది. అన్నమయ్య సేవా మండలి సభ్యులు అన్నమయ్య సంకీర్తలను ఆలపించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం పోలీసు బందోబస్తు చేపట్టారు.

చలో విజయవాడకు తరలిరండి: డీటీఎఫ్

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 16: ఉద్యోగ, ఉపాధ్యాయ డిమాండ్ల సాధనకు ఏపీ జేఏసీ ఈనెల 27వ తేదీన తలపెట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 13లక్షలమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు తమ డిమాండ్ల సాధనకు ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహులు, సోమశేఖర్‌నాయక్, వెంకటాచలమయ్య, నాగరాజు, టోపీ వలి, శ్రీధర్ పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 16: మండలంలోని వేమారెడ్డిపల్లి సమీపంలో గల రైయిన్‌బో పాఠశాల వద్ద దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఘటనపై బాధితుడు పీట్ల రామాంజనేయులు శుక్రవారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రెయిన్‌బో పాఠశాల వద్ద రేకుల బంకులో దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని, కాగా గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి బంకు వెనుకవైపున రేకులకు అమర్చిన స్క్రూలను తొలగించి లోనికి ప్రవేశించారని, అనంతరం అందులోని రూ.50వేలు విలువ చేసే పలు వస్తువులను అపహరించారని వాపోయాడు. చోరీ విషయాన్ని స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గాండ్లపెంట, ఫిబ్రవరి 16: మండలంలోని కటారుపల్లి పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణవేణి శుక్రవారం తెలిపారు. కటారుపల్లి సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో.. వెంటనే దాడులు నిర్వహించామన్నారు. పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారినుంచి రూ.3,100 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో సిబ్బంది రామయ్య, శ్రీనివాసులు, భాస్కర్‌రాజు, నరసింహ పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యం కోసం బీసీలు ఏకం కావాలి

నల్లమాడ, కొత్తచెరువు ఫిబ్రవరి 16:నియోజకవర్గంలో బీసీలు రాజకీయ చైతన్యం కోసంఏకం కావాలని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం అఖిలపక్ష బీసీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సామకోటి మాట్లాడుతూ ఈనెల 21న జిల్లాకేంద్రంలోని శిల్పారామంలో బీసీల ఐక్యత సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో బీసీలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొట్టాల శ్రీరాములు, బుట్టి నాగభూషణ నాయుడు తదితరులు పాల్గొన్నారు. కొత్తచెరువులోని డిపో భాస్కర్ స్వగృహంలో బీసీసంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్, గౌరవాధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో ఈనెల 21న జరిగే బీసీ ఐక్యవేదిక సదస్సును విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కొత్తచెరువులోని బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఒలిపిశీన, గాండ్లశివ, చెన్నకేశవులు, కురుబ నాగరాజు, గఫూర్, రవణప్ప,లింగమయ్య పాల్గొన్నారు.

బీసీ సమావేశాన్ని విజయవంతం చేయండి

కదిరిఅర్బన్: జిల్లాకేంద్రమైన పుట్టపర్తిలో ఈనెల 20, 21వ తేదీల్లో నిర్వహించనున్న బీసీ సమావేశాలను విజయవంతం చేయాలని బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సంపంగి గోవర్ధన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశాలకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు హాజరుకానున్నట్లు చెప్పారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు, వివిధ పార్టీలు అవలంబిస్తున్న తీరు, బీసీ సమస్యల సాధన కోసం చేపట్టాల్సిన అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. బీసీలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో బీసీ నాయకులు కిష్టప్ప, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రాయల పాలన అందరికీ ఆదర్శం


కదిరిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బలిజ సంఘం నాయకులు


బుక్కపట్నంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

● కొనియాడిన బలిజ సంఘం నాయకులు

● ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 16 : విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అందరికీ ఆదర్శప్రాయుడని, వందల ఏళ్లు గడిచినా మరచిపోని విధంగా ఆయన పరిపాలన సాగించారని బలిజసంఘం నాయకులు కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా పట్టణంలోని ఆరామంలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత రాయల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ రాయల పరిపాలనా యుగం స్వర్ణయుగంగా గుర్తింపు పొందిందన్నారు. రాయలవారు రైతుల కోసం అనేక చెరువులు, కుంటలను తవ్వించారని గుర్తు చేశారు. అలాగే ఎన్నో ఆలయాలను నిర్మించారని చెప్పారు. తెలుగుభాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. ఆయన బాటలో అందరూ పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లికార్జున, గంగాధర్, చింత దామోదర్, బాలగంగాధర్, దండు నాగరాజు, శ్రీరాములు, ముత్యాల మధు, మారుతీప్రసాద్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం : శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... శ్రీకృష్ణదేవరాయలు తన పరిపాలనలో ప్రజాసంక్షేమానికి ఎంతో పాటు పడ్డారని తెలిపారు. ముఖ్యంగా రైతుల కోసం ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు డిష్‌రాజు, పట్టణ, రూరల్ ప్రధానకార్యదర్శులు, నాయకులు దుస్సాకృష్ణ, రాప్తాటిరాము, నారాయణస్వామియాదవ్, నబీరసూల్, పొరాళ్లరహీం, చింతాజగదీశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ నాయకులు కూడా శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు అడ్డగిరి శ్యాంకుమార్, కోల నాగార్జున,శ్రీరాములు, పేరూరు శ్రీనివాసులు, సుధాకర్, బండ్లచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: శ్రీకృష్ణదేవరాయల జయంతిని పట్టణంలో బలిజ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆర్‌అండ్‌బీ బంగ్లానుంచి కాలేజీ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, పూలే సర్కిల్,జీవిమాను సర్కిల్, చౌక్ సర్కిల్ మీదుగా కోనేరు సర్కిల్‌వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడి శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత అక్కడనుంచి అర్‌అండ్‌బి బంగ్లాకు చేరుకుని అక్కడ సమావేశం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల గొప్పతనాన్ని వివరించారు. ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భైవరప్రసాద్, మంచి శివశంకర్, గవ్వల శ్రీనివాసులు, పత్తి చంద్రశేఖర్, రమణ, రమేష్, శ్రీనివాసులు, ఆది, పసుపులేటి సురేష్‌కుమార్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం: శ్రీకృష్ణదేవరాయల జయంతిని మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానికంగా ఉన్న ఆయన విగ్రహానికి బలిజలు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కేక్ కట్ చేశారు. పలువురు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల పాలనలోనే బుక్కపట్నం చెరువు తవ్వించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కరణం శ్రీరాములు, దాసరి శ్రీనివాసులు, సతీష్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండల కేంద్రంలోని బుక్కపట్నం రహదారిలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి టీడీపీ నాయకుడు సంగాసుధాకర్ బలిజ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళుర్పించారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం

● వామపక్ష నాయకుల విమర్శ


కదిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 16: కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన ఈ పదేళ్ల కాలంలో 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక చట్టాలను కాల రాస్తోందని వామపక్ష నాయకులు విమర్శించారు. గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా శుక్రవారం వారు పట్టణంలో అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. పలువురు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ అధికారం చేపట్టిన తరువాత అదాని, అంబానీ ఆస్తులు భారీగా పెరిగాయన్నారు. కార్మికులు, కర్షకులు, రైతుల కష్టాన్ని కార్పొరేట్లకు ధార పోస్తున్నట్లు విమర్శించారు. కార్మిక వ్యతిరేక చట్టాలు తెచ్చి వారి పొట్ట కొడుతున్నారని మండిపడ్డారు. పంటలకు మద్దధర చట్టం తీసుకురావాలన్నారు. కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బిరెడ్డి, రాజేంద్రప్రసాద్, లియాకత్, నరసింహులు, పవన్, మహేంద్ర, ఇమ్రాన్, జగన్మోహన్, ముస్తాక్, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ధర్మవరంరూరల్: మండలంలో గొట్లూరు గ్రామంలో సీపీఎం , రైతుసంఘం నాయకులు కలిసి గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సచివాలయాన్ని బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. రైతుసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య మాట్లాడుతూ .. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, .స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతులకు బ్యాంకులలో ఉన్న రుణాలను మాఫీ చేయాలన్నారు. పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పోలవరంప్రాజెక్టుకు అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, ప్రధానకార్యదర్శి జేవీ రమణ, నాయకులు ఎస్‌హెచ్ భాషా, వెంకటనారాయణ, మారుతి, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండలకేంద్రంలోని సచివాలయం ఎదుట సీపీఐ నాయకులు గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దాతలపట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు చిన్నచూపు చూస్తున్నాయని మండిపడ్డారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్వామినాథన్ సిఫారస్‌లను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు గ్రామీణభారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా కదిరి, హిందూపురం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. రాస్తారోకోలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పెంచిన రైతుల రుణాలను మాఫీ చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు సమాన పనికి సమాన వేతనాన్ని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26వేలు ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల పట్టాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలన్నారు. సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు, భవన నిర్మాణ కార్మిక మండల అధ్యక్ష, కార్యదర్శులు కేశప్ప, సూర్యనారాయణ, స్వచ్ఛభారత్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా మండలంలోని బాలసముద్రం గ్రామ సచివాలయం సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. సీపీఐ నాయకుడు రెడ్డెప్ప మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేరళ తరహాలో రైతు రుణ విముక్తి చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.10వేలు చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిపార్సులు అమలు చేయాలని, నిరుపేదలకు భూ పంపిణీలో 5 ఎకరాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి శివన్న, రైతు సంఘం నాయకులు చౌడప్ప, ఇక్బాల్, గిరిజన సంఘం నాయకుడు ప్రసాద్‌నాయక్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో చైనీస్ సంబరాలు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 16: చైనా నూతన సంవత్సర వేడుకలను ఆ దేశ భక్తులు శుక్రవారం స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. సత్యసా యి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి జ్యోతి ప్రజ్వలన చేసి, చైనా వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. మొదట ఆ దేశ భక్తులు డ్రాగన్ డ్యాన్స్‌తో అలరించారు. చైనాదేశ సేవాసంస్థల కోఆర్డినేటర్ జెక్లిన్ మాట్లాడుతూ.. సత్యసాయి ప్రేమతత్వం అనన్యమనీ, సాయి చూపిన బాటలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం చోంగ్‌చ్యూసెన్ బృందం సంగీత కచేరితో భక్తులను అలరించింది. చైనా సంప్రదాయ సంగీతంతో గంటపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు నృత్యంతో అలరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో ఇండోనేషియా, మలేషియా, సింగపూర్, మాల్దీవ్స్ నుంచి దాదాపు 500 మంది భక్తులు పాల్గొన్నారు.




డ్రాగన్ డ్యాన్స్ చేస్తున్న చైనీయులు.. అలరించిన చిన్నారుల ప్రదర్శన

సుబ్రహ్మణ్యస్వామికి వసంతోత్సవం



పాలబావిలో పూజలు చేస్తున్న దృశ్యం

రొళ్ల, ఫిబ్రవరి 16: మండలంలో వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వసంతోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి రత్నగిరి పావన గంగగా పేరుగాంచిన పాలబావికి తీసుకెళ్లి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 16: మహాత్మా జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ 2024-2025 మొదటి సంవత్సరం అడ్మిషన్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మురళీధర్ రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం బాలురు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు మార్చి 1వతేదీ నుంచి మార్చి 31వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 13వతేదీ రాతపరీక్ష నిర్వహిస్తారన్నారు. వివరాలకు 9493892619, 9182223494 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మోడల్ ఫౌండేషన్ స్కూల్ ఎంపికకు పరిశీలన

లేపాక్షి, ఫిబ్రవరి 16: మోడల్ ఫౌండేషన్ స్కూల్ ఎంపిక కోసం రాష్ట్ర బృందం శుక్రవారం మండలంలో పర్యటించింది. ప్రథమ్ స్టేట్ కోఆర్డినేటర్ సూర్యబాబు, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసులు మండలంలోని నాయనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో భవనాలు, తరగతి గదులు, ఫర్నిచర్, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల ప్రతిష్టంబన తదితర అంశాలను పరిశీలించారు. నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

రాష్ట్ర లీగల్‌సెల్ జాయింట్ సెక్రటరీగా న్యాయవాది నాగరాజు

పెనుకొండ, ఫిబ్రవరి 16: రాష్ట్ర లీగల్‌సెల్ జాయింట్ కార్యదర్శిగా తనను నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయని పెనుకొండ పట్టణానికి చెందిన న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యులు శర్మ, జావీద్, నాగిరెడ్డి, వాల్మీకి శ్రీనివాసులు తదితరులు ఆయనకు శుక్రవారం పూలమాలలువేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు రాష్ట్ర లీగల్‌సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

21 నుంచి ప్రజా పోరుయాత్ర: బీజేపీ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 16: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు బీజేపీ ప్రజా పోరుయాత్ర కార్యక్రమం చేపట్టిందని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ్‌కుమార్, ప్రజాపోరుయాత్ర కో కన్వీనర్ చలపతి తెలిపారు. వారు శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి గ్రామంలోను ప్రజా పోరుయాత్ర చేపట్టి ప్రజలతో నేరుగా మాట్లాడుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ఏఏ నిధులు, ఎన్ని ఇచ్చిందో తెలియజేస్తామన్నారు. వైసీపీ అరాచకపాలనను ప్రజలకు తెలియజేస్తామన్నారు. హిందూపురం నుంచి బీజేపీ తరపున అసెంబ్లీకి 11 మంది, పార్లమెంట్ స్థానానికి ఎనిమిది మంది ఆశావహులు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్, ప్రజా పోరు యాత్ర అసెంబ్లీ కో కన్వీనర్‌లు తిరుమలేష్, బాబు, నాయకులు శంకర్, బద్రి, చంద్ర, కిష్టప్ప, వెంకటరామిరెడ్డి, ఉదయ్‌కుమార్, జైకృష్ణ నాగరాజు, నరేష్, నాగరాజు, నాగేంద్ర ఉన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని శెట్టిపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు కృష్ణానాయక్ అన్న కుమారుడు మణికంఠనాయక్ శుక్రవారం హఠాన్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత స్వగ్రామానికి చేరుకుని భౌతికకాయాన్ని దర్శించి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు రాజ్యాంగ చైతన్య రథయాత్ర

పావగడ, ఫిబ్రవరి 16: భారత రాజ్యాంగ చైతన్య రథయాత్రను శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ పావగడలో ప్రారంభిస్తారని, తాలూకా స్థాయి అధికారులు హాజరుకావాలని గ్రేడ్-2 తహసీల్దార్ నరసింహమూర్తి తెలియజేశారు. ఉదయం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం రథయాత్రను ప్రారంభిస్తారన్నారు. 17న పావగడ పట్టణం రాజవంతి, వెంకటాపురం, దొమ్మతిమర్రి పంచాయతీలో, 18న విరుపసముద్రం, కుడుమడుగు, రొప్పం, పళవళ్లి పంచాయతీల్లోనూ, 19న బి.కె.హళ్లి, నాగలమడక, ర్యాప్టా, తిరుమణి పంచాయతీల్లోనూ, 20న వళ్లూరు, పొన్నసముద్రం, బూదిబెట్ట, మరదాసనహళ్లి, జే అచ్చంపల్లిలోనూ ఉంటుందన్నారు. 21న సిద్దాపురం, వైఎన్‌హొసకోట, పోతుగానహళ్లి, చిక్కహళ్లి, కామనదుర్గ పంచాయతీల్లోనూ, 22న కోటగుడ్డం, రంగసముద్రం, వదనకల్లు, సానులకుంట, న్యాయదగుంట పంచాయతీల్లో నిర్వహిస్తామన్నారు. 23న అరసికెరె, మంగళవాడ, కె.టి.హళ్లి, గుజినేడు, సీకే పుర, బ్యాడనూరు, కన్నమేడి, నలిగానహళ్లి గ్రామ పంచాయతీల్లో ఈరథయాత్ర కొనసాగుతుందని తెలియజేశారు.

బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని బుళ్ళసముద్రం గ్రామ సమీపంలో హైవే రోడ్డుపై మధ్యాహ్నం12 గంట సమయంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గుడిబండ మండలం మోపురగుంట గ్రామానికి చెందిన శంకరప్ప, మనవడు అభిలాష్ మణూరుకు వెళ్లి వెనుతిరిగి మడకశిర వైపు వసున్నారు. మరో ద్విచక్రవాహనంలో వస్తున్న అరుణ్ అనే వ్యక్తి వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురూ కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. వారిని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్సలు అందించారు.





మడకశిరలో ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన వీరభద్రస్వామి, అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు



గోరంట్లలో సూర్య నమస్కారాలు చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 16: రథసప్తమి సందర్భంగా పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయంలో శుక్రవారం అగ్నిగుండ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనేక మంది భక్తులు అగ్నిగుండంలో నడిచి మొక్కులు తీర్చుకొన్నారు. గురువారం రాత్రి వీరభద్రస్వామి ఆలయ ప్రవేశం, గంగపూజ, గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠాపన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున అగ్ని గుండ మహోత్సవాన్ని నిర్వహించారు. వీరభద్రస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అలాగే షిర్డీ సాయి ఆలయంలో రథసప్తమి పురస్క రించుకొని 101 సూర్యనమస్కారాలు చేశారు. సాయంత్రం వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాన్ని వీరగాసె నృత్యాలతో పురవీధుల్లో ఊరేగించారు.

పెనుకొండ: స్థానిక లక్ష్మీ వెంకటరమణ స్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు రామకృష్ణాచార్యులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాద వినియోగం గావించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను సూర్యప్రభ వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

గోరంట్ల: పట్టణంలోని ఎస్‌టీపీఎం డిగ్రీ కళశాలలో 108 సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించారు. యోగా శిక్షకులు సురేష్ ప్రిన్సిపాల్ భక్తవత్సలం, లక్ష్మీనారాయణ, రమేష్, ధనుంజయ, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానుల పేరుతో నిలువు దోపిడీ

- రాజధాని లేని రాష్ట్రం చేసిన ఘనత జగన్‌దే
- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 16: మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్ అండ్‌కో నిలువు దోపిడీ చేశారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని నిలబెట్టిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. ఆయన శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధి శూన్యమన్నారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప ముఖ్యమంత్రి చేసింది ఏమీలేదన్నారు. రాజధాని ఫైల్స్ సినిమాతో ముఖ్యమంత్రి జగన్ వెన్నులో వణుకు పుట్టిందన్నారు. ఒక్క సినిమాను చూసి ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి భయపడటం ఇదే తొలిసారి అన్నారు. రాజధాని రైతుల బతుకు ఛిద్రం అంశంగా తీసిన సినిమాను అడ్డుకోవాలని చూడటం ఈప్రభుత్వ నీచ సంస్కృతికి నిదర్శనం అన్నారు. అమరావతి రైతుల ఉసురు ఊరికే పోదని, రాష్ట్రం కోసం ప్రజల కోసం తీసిన సినిమాను సాక్షాత్తు ముఖ్యమంత్రి అడ్డుకోవడం దారుణం అన్నారు. సినిమా విడుదల అయితే తమ ప్రభుత్వంపై ప్రజల్లో మరింత వ్యతిరేకత వస్తుందనే భయంతోనే వైసీపీ ప్రభుత్వం కోర్టుకు వెళ్లిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌లో ఓటమిభయం పట్టుకుందని, ఇలాంటి విపరీత బుద్ధులే వినాశనానికి దారులు తీస్తాయన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపడితేనే రాష్ట్రానికి భవిష్యత్తు అని ప్రజలు విశ్వసిస్తున్నారని, రాబోయేది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమేనని జోశ్యం చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు భక్తర్, నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, నాయకులు దాసిరెడ్డి ఉన్నారు.

మహిళ ఖాతా నుంచి రూ.1.68 లక్షలు మాయం

రొద్దం, ఫిబ్రవరి 16: మండలంలోని రెడ్డిపల్లికి చెందిన లక్ష్మి అనే మహిళ ఖాతా నుంచి రూ.1.68లక్షలు మాయమయ్యాయి. ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లక్ష్మికి రొద్దం కెనరాబ్యాంక్‌లో ఖాతా ఉంది. జనవరి 30న కెనరాబ్యాంక్ నుంచి మాట్లాడుతున్నానని లక్ష్మికి ఫోన్‌చేసి చెప్పారు. ఏటీఎం కార్డు వచ్చిందనీ, అందుకు ఓటీపీ చెప్పాలన్నారు. వారి మటలు నమ్మి లక్ష్మి ఓటీపీ చెప్పడంతో రూ.28వేలు ఖాతా నుంచి కట్ అయింది. ఈ విషయంపై మహిళ మరుసటి రోజు రొద్దం కెనరాబ్యాంక్ అధికారికి తెలిపి, తన ఖాతాను హోల్డ్‌లో పెట్టమని కోరింది. అధికారులు స్పందించకపోవడంతో ఫిబ్రవరి 15న మరోమారు ఖాతా నుంచి రూ.1.40లక్షలు కట్ అవడంతో ఆమె లబోదిబోమంది. ఈ విషయంపై మూడు రోజులుగా ఆ మహిళ కెనరాబ్యాంక్, రొద్దం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతోంది. కెనరాబ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంతోనే తన డబ్బు కట్ అయిందని మహిళ వాపోతోంది. బెంగళూరుకు చెందిన ఎక్స్‌క్రో ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేసే ఓ వ్యక్తి రిలయన్స్ కంపెనీకి రూ.1.40లక్షలు జమ చేసినట్లు కెనరాబ్యాంక్ ఆధారాలు బయటపడ్డాయి. ఆ కంపెనీ ఖాతా లావాదేవీలు రూ.కోట్లలోనే జరుగుతుంటాయని అధికారుల ద్వారా తెలిసింది. స్థానికంగా ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో సోమవారం రమ్మన్నారని మహిళ వాపోయింది.

లేపాక్షిని సందర్శించిన పరిపూర్ణానంద స్వామి



ఆలయం వద్ద మాట్లాడుతున్న పరిపూర్ణానందస్వామి

లేపాక్షి, ఫిబ్రవరి 16: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గావీరభద్రస్వామి ఆలయాన్ని శుక్రవారం కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి సందర్శించారు. అర్చకుడు నరసింహశర్మ ఆలయ చరిత్ర వివరించారు. దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధిష్టానం ఆదేశిస్తే హిందూపురం ఎంపీగా బరిలో నిలుస్తానన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీపై ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

రొళ్ల, ఫిబ్రవరి 16: టీడీపీ నాయకులు శుక్రవారం మండలకేంద్రంతో పాటు రత్నగిరి, కాకి, బ్యాడిగెర గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ డాక్టర్స్ సెల్ నాయకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే అభివృద్ధి సాధ్యమన్నారు. దీనికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మూర్తి, నాగేంద్ర, కిరణ్, రమేష్, దాసప్ప, నగేష్ తదితరులు ఉన్నారు.

కమిషనర్ చాంబర్‌లో కార్మికుల నిరసన



కమిషనర్ చాంబర్‌లో బైఠాయించిన పారిశుధ్య కార్మికులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 16: తమ హామీలు నెరవేర్చాలంటూ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు శుక్రవారం మునిసిపల్ కమిషనర్ చాంబర్‌లో బైఠాయించి నిరసన చేపట్టారు. గత ఏడాది డిసెంబర్‌లో మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు రాష్ట్ర వ్యాప్త సమ్మె నిర్వహించారు. అప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ మొదట కమిషనర్ కార్యాలయం ముందు కూర్చుని నిరసన తెలిపారు. కమిషనర్ ఎంత సేపటికి రాకపోయే సరికి చాంబర్‌లోకి వెళ్లి నిరసన చేపట్టారు. గతంలో 16 రోజులు సమ్మెలో ఉండగా అప్పటి మునిసిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఇచ్చిన మూడు హామీలపై ప్రస్తుత కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని అడిగారు. హామీలు ఇచ్చింది నేను కాదు గత కమిషనర్ అని తాను నెరవేర్చలేనన్నారు. దీంతో మునిసిపల్ కార్మికులు ఆగ్రహించారు. భవిష్యత్ కార్యచరణకు మీరే బాధ్యులు అని హెచ్చరించి వెనుతిరిగారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్మిక యూనియన్ నాయకులు మల్లికార్జున, జగదీష్, ఆనంద్, గురునాథ్, పరమేష్ చంద్ర, సీఐటీయూ నాయకులు సాంబశివ, రాజప్ప, రామకృష్ణ వదలాది మంది మునిసిపల్ కార్మికులు ఉన్నారు.

రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

సీఐటీయూ నాయకులు



పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలుపుతూ దేశవ్యాప్త గ్రామీణ బంద్ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా హిందూపురంలో స్థానిక ఇందిరా పార్కు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడతూ... రైతులకు న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం గుడ్డిగా వెళ్తోందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను సమగ్రంగా పరిశీలించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్మికవర్గం పోరాటాలతో సాధించుకున్న హక్కులపై కేంద్ర ప్రభుత్వం దాడిచేస్తోం దన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి సాంబశివ, రాజప్ప, రామకృష్ణ, అంగన్‌వాడీ వర్కర్‌ల యూనియన్ కార్యదర్శి లావణ్య, మునిసిపల్ వర్కర్ల సంఘం అధ్యక్షుడు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి జగదీష్, కోశాధికారి గురునాథ్, పరమేష్ చంద్ర ఎస్ఎఫ్ నాయకుడు బాబావలి, పెద్ద సంఖ్యలో కార్మికులు ఉన్నారు.

పెనుకొండ: కేంద్ర ప్రభుత్వం పదేళ్ల నుంచి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తోందంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన భారత్‌బంద్‌లో భాగంగా పెనుకొండలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు, పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ సర్కిల్‌వద్ద రాస్తారోకో చేప ట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్, సీఐటీయూ నాయకుడు రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పావగడ: కేంద్రప్రభుత్వం నిత్యావసరాల సరుకుల ధరలను పెంచడంతోపాటు కార్మిక హక్కులను కాలరాస్తోందంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐబీ నుంచి ర్యాలీగా వచ్చి శనిమహాత్మ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకురాలు సుశీలమ్మ, కార్మిక సంఘం నాయకులు రామకృష్ణప్ప, శివగంగమ్మ తదితరులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గ్రేడ్-2 తహసీల్దార్ నరసింహమూర్తికి అందజేశారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయల జయంతిని బలిజ కులస్థులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. హిందూపురం పట్టణ పరిధిలో ని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రాయల విగ్రహానికి బలిజసంఘం నాయకులు, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుకొండ పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల వైజంక్షన్‌లో ఉన్న కాంస్యవిగ్రహానికి, పట్టణం లోని మార్కెట్ సమీపంలో ఉన్న కృష్ణదేవరాయల విగ్రహానికి బలిజ సంఘం నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. గోరంట్లలో బలిజ సంఘం ఆధ్వర్యంలో కదిరి రోడ్డులోని పెట్రోల్ బంక్‌నుంచి గుమ్మయ్యగారిపల్లి కూడలి వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. విజయనగర్ కాలనీలో శ్రీకృష్ణదేవరాలయ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం గోరంట్ల బస్టాండ్ కూడలిలో అన్నదానం చేపట్టారు.



గోరంట్లలో నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుడిబండ, ఫిబ్రవరి 16 : మండలంలోని హిరేతుర్పి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని శుక్రవారం ప్రత్యేక పూలతో అలంకరించి రథంలో ఉంచారు. గోవింద నామస్మరణతో ఆంజనేయస్వామి రథాన్ని భక్తులు లాగారు. రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామస్థులు తరలివచ్చారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

వైసీపీని బంగాళాఖాతంలో కలుపుదాం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 16 : అధికార పార్టీ వైసీపీని మడత పెట్టి బంగాళాఖాతంలో కలిపే సమయం ఆసన్నమైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత అన్నారు. ఆమె శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ... వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దేశ చరిత్రలోనే పాలనలో ఇంతగా విఫలమైన ప్రభుత్వం లేదన్నారు. ఈ ప్రభు త్వ వైఫల్యంతో అన్ని రంగాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొ న్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజావేదికను కూల్చడంతోనే తన విధ్వంసకర పాలన మొదలుపెట్టారని, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని అన్నారు. యువత భవిష్యత్తును సర్వనాశనం చేశారన్నారు. మహిళలు, మైనార్టీలు, దళితులపై దాడులుచేయడం, భయాందోళనకు గురిచేయడం ఈ అధికార పార్టీకే చెల్లుబాటైందన్నారు. వీరితో పాటు ప్రతిపక్ష నేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన కూటమితో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ, సోము, మైనార్టీ నాయకుడు దాదు, త్రివేంద్ర, వాసుదేవరెడ్డి, రమణమ్మ, మారుతి, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణదేవరాయలను ఆదర్శంగా తీసుకోవాలి

పెనుకొండ టౌన్: నిస్వార్థంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, వసతులు ఏర్పాటుచేసిన కృష్ణదేవరాయలను ఆదర్శంగా తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయల 553వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మార్కెట్ సమీపంలోని కృష్ణదేవరాయల విగ్రహం వద్ద ఆమె నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయల కాలంలో ఏర్పాటుచేసిన చెరువులు, ఆలయాలు, ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

అగళి, ఫిబ్రవరి 16: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహిం చిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎంపీపీ రేణుక అధ్యక్షతన జరిగిని ఈ సమావేశానికి జడ్పీటీసీ ఉమేష్ గైర్హాజరయ్యారు. మం డలంలో విద్యుత్‌శాఖ ఏఈ, పశువైద్యాధికారి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక విద్యుత్ వినియోగదారులు, పశువుల యజమానులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. సభ్యుడు ముదిరాజ్ మాట్లాడుతూ.. అల్లికెర పంచాయతీలోని రామాపురం గొల్లహట్టి గ్రామంలోని పాఠశాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. అలాగే అగళికి సకాలంలో ఏపీఎస్ఆర్‌టీసీ బస్సులు నడ పాలని, శిర-హిందూపురం బస్సు సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. వివిధ శాఖల అధికారులు ఆయాశాఖలకు సంబంధించిన వివరాలను సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, పరిపాలన అధికారి శ్రీనివాసరావు, డీటీ సుబ్బారావు, వైస్ ఎంపీపీ గాయత్రి, కోఆప్షన్ మెంబర్ నజీర్‌సాబ్, టీడీపీ ఎంపీటీసీ రంగమ్మ తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కానందునే హాజరు కాలేదు


: జడ్పీటీసీ ఉమేష్

అగళి : వైసీపీ పాలకమండలి ఏర్పడినప్పటి నుంచి జరిగిన మండల సర్వసభ్య సమావేశాల్లో మొదటి నుంచి తెలిపిన ఏ ఒక్క సమస్య కూడా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదని జడ్పీటీసీ ఉమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే మండల ఈ సమావేశానికి హాజరు కాలేదని అన్నారు. సమావేశంలో కేవలం మాట్లాడతారని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. మండలంలోని అనేక సమస్యలను జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ విన్నవించినా పరిష్కారం కాలేదన్నారు. ఎవరికి చెప్పాలో తెలియక సమావేశాలకు హాజరు కాలేదన్నారు. మండలంలో రూ.2.90కోట్లతో వైఎస్ఆర్ సుజల స్రవంతి ద్వారా పథకాన్ని నిర్మించారని, ఎండలు తీవ్రం అవుతున్న నేపథ్యంలో నెలరోజుల నుంచి తాగడానికి నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజాప్రతినిధులు కానీ, అధికార యంత్రాంగం కానీ పట్టించుకోవడం లేదన్నారు. పేరుకు మాత్రమే సమావేశాలని వాపోయారు.

నేడు ఉద్యోగుల ఆందోళన

మడకశిరటౌన్, ఫిబ్రవరి 16: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు మడకశిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు జేఏసీ నియోజకవర్గ చైర్మన్ రాము తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మికుల కు 11వ పీఆర్‌సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. సరండర్‌లీవ్, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఉద్యోగ వర్గాలకు రావాల్సిన బకాయిలు వెంటనేవిడుదల చేయాలన్నారు. 12వ పీఆర్‌సీ హక్కుల సాధన కోసం ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ఉద్యోగ వర్గాలు అధిక సంఖ్యలో హాజరై ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటి స్థలాల కోసం ధర్నా



ఇళ్లస్థలాల కోసం ధర్నా చేస్తున్న పాలసముద్రం వాసులు

గోరంట్ల, ఫిబ్రవరి 16: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో పాలసముద్రం గ్రామస్థులు ఇళ్లస్థలాల కోసం ధర్నా నిర్వహించారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గతంలో పట్టాలున్నవారికి స్థలాలు చూపించాలని, అనుభవంలో ఉన్నవారికి హక్కు పత్రాల కోసం గత ఆరు నెలలుగా తరచూ ఆందోళనకు దిగుతున్న విషయం తెలిసిందే. పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలో సర్వేనెంబర్ 125లో 6.74 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఇటీవల సీపీఎం సహకారంతో గుడిసెలు ఏర్పాటు చేశారు. అనుభవంలో ఉన్న స్థలాల్లో ఇళ్ల నిర్మా ణం చేపట్టగా... నీరు, ఇటుకల రవాణా తదితర సౌకర్యాలు అందకుండా స్థానికంగా అవరోధం కల్పించారు. దీంతో సీపీఎం నాయకులు హనుమయ్య ఆధ్వర్యంలో పలువురు తహసీల్దార్ కార్యాల యం వద్ద ఉదయం 11నుంచి రాత్రి 7వరకు ధర్నా నిర్వహించారు. అక్కడ వంటవార్పు చేశారు. తహసీల్దార్ అక్బల్‌బాష వారితో మాట్లాడుతో నీటి సరఫరా విషయంపై ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. తాను ఎన్నికల నిర్వహణ కోసం బదిలీపై వచ్చానని ఇళ్లపట్టాల విషయం ఇప్పటికిప్పుడే ఏమీ చేయలేమన్నారు. అలాకాదని విధులకు ఆటంకం కలిగిస్తే చర్యల కోసం ఉన్నతాధికారుకులకు తెలియచేయాల్సి ఉంటుందని చెప్పారు.